క్లుప్తంగా

నేడు ఈద్గా వద్దకు ప్రతాప్‌రెడ్డి

జనగామ: ముస్లింలు అత్యంత పవిత్రంగా నిర్వహించుకునే బక్రీద్ పండుగ సందర్భంగా నేడు (సోమవారం) డీసీసీ అధ్యక్షుడు కొమ్మూరి ప్రతాప్‌రెడ్డి సిద్దిపేట రోడ్ గాయత్రి గార్డెన్స్ ఎదురుగా ఉన్న ఈద్గా వద్దకు వస్తున్నారని కాంగ్రెస్ పార్టీ పట్టణ అధ్యక్షుడు చెంచారపు బుచ్చిరెడ్డి తెలిపారు. ఆదివారం ఆయన మాట్లాడుతూ ఉదయం 8 గంటల వరకు ఈద్గా వద్దకు ప్రతాప్‌రెడ్డి వచ్చి ముస్లింలకు శుభాకాంక్షలు తెలుపుతారని అన్నారు. కాంగ్రెస్ పార్టీ ముఖ్యనాయకులు, కార్యకర్తలు, మైనార్టీ నాయకులు, మహిళా విభాగం, యూత్‌కాంగ్రెస్, ఎన్‌ఎస్‌యుఐ, ప్రజా ప్రతినిధులు అందరూ తప్పకుండా పాల్గొనాలని సూచించారు.

ఎన్నిక


పవన్

చిల్పూరు: మండలంలోని వెంకటాద్రిపేట శివారులోని మెట్టు పంచముఖ ఆంజనేయ స్వామి (నాగేంద్ర సమేత శివాలయం) ఆలయ కమిటీ అధ్యక్షుడిగా గ్రామానికి చెందిన వడ్డేపల్లి పవన్‌ను ఏకగ్రీవంగా ఆదివారం ఎన్నుకున్నారు. ఈ సందర్భంగా గ్రామ మాజీ సర్పంచ్ ఆలయ గౌరవ అధ్యక్షుడు కందుల రఘుపతి అధ్యక్షతన నూతన కమిటీ సమావేశం నిర్వహించారు. కాగా, పవన్ మాట్లాడుతూ గ్రామస్తులు, దాతలు సహకారంతో ఆలయాన్ని అభివృద్ధి చేసుకుందామని అన్నారు. ప్రధాన కార్యదర్శి వలబోజు బ్రహ్మచారి, ఉపాధ్యక్షుడు బోగి భాస్కర్, కోశాధికారి పెసరు అనీల్, కార్యదర్శి నోముల సురేష్ సభ్యులు రాజేంద్రప్రసాద్‌రెడ్డి, జంగం యాదగిరి, సమ్మయ్య, మంతెన లవన్‌కుమార్, రమేష్‌రెడ్డి, సంపత్, రజనీకర్, ప్రభాకర్, మల్లారెడ్డి, శ్రీనివాస్ తదితరులు ఉన్నారు.

పరామర్శ



పాలకుర్తి టౌన్: పాలకుర్తి మండల కేంద్రంలో మామిండ్ల ఎల్లయ్య ఇటీవల మృతి చెందాడు. కాగా బాధిత కుటుంబ సభ్యులను మాజీ వార్డు సభ్యుడు వీరమనేని హన్మంతరావు పరామర్శించారు. ఆదివారం మృతుడి కుమారుడు సీపీఐ ఎంఎల్ లిబరేషన్ రాష్ట్ర కార్యదర్శి మామిండ్ల రమేష్‌రాజాకు బియ్యాన్ని విరాళంగా అందజేశారు. గాదెపాక సోమయ్య తదితరులు ఉన్నారు.

మీ సేవలో సదరం క్యాంపుల సమాచారం

పాలకుర్తి: దివ్యాంగులు మీ సేవలో సదరం స్లాట్ క్యాంపుల బుకింగ్ సమాచారాన్ని తెలుసుకోవాలని కాంగ్రెస్ పార్టీ బ్లాక్ అధ్యక్షుడు రాపాక సత్యనారాయణ తెలిపారు. ఆదివారం ఆయన మాట్లాడుతూ ఈ నెల 17వ తేదీన మధ్యాహ్నం 12 గంటలకు సదరం స్లాట్ క్యాంపు బుకింగ్‌లు జిల్లా కేంద్రంలో అందుబాటులో ఉన్నాయని చెప్పారు. సదరం సర్టిఫికెట్ 40 శాతం కంటె తక్కువ ఉండి తిరస్కరించబడిన దివ్యాంగులు మీ సేవలో , డీఆర్‌డీఓలో, ప్రభుత్వ ఆస్పత్రిలో డిలీట్ కావడం జరగదన్నారు. డాక్టర్ రిపోర్టు, ఆధార్ కార్డు, ఫొటో, మీ సేవ రశీదుతో జిల్లా ప్రభుత్వ ఆస్పత్రి నందు హాజరు కావాలని సత్యనారాయణ కోరారు. ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని అన్నారు.

గుండెపోటుతో ఆర్టీసీ కండక్టర్ మృతి


రమేశ్ (ఫైల్)

బచ్చన్నపేట: మండల కేంద్రానికి చెందిన ఆర్టీసీ కండక్టర్ లక్కర్స్ రమేశ్ (54) గుండెపోటుతో ఆదివారం మృతి చెందాడు. మృతుడు రమేశ్ జనగామ ఆర్టీసీ డిపోలో కండక్టర్‌గా విధులను నిర్వహిస్తున్నాడు. కొన్ని సంవత్సరాల క్రితం స్టంట్ వేసుకున్న రమేశ్ విధులను ముగించుకొని ఇంటికి వచ్చి ఒక్కసారిగా అస్వస్థతకు గురి కాగా కుటుంబ సభ్యులు జనగామ ఆస్పత్రికి తరలించగా మృతి చెందాడని తెలిపారు. మృతుడికి భార్య దుర్గామణి, ఒక కొడుకు, కూతురు ఉన్నారు. రమేశ్ మృతికి జనగామ డిపో తోటి కండక్టర్లు, డ్రైవర్లు, స్నేహితులు తదితరులు పరామర్శించి ప్రగాఢ సానుభూతి తెలిపారు.

ఎల్లయ్యకు డాక్టరేట్




కేయూ క్యాంపస్: కాకతీయ యూనివర్సిటీలోని సోషియాలజీ విభాగం పరిశోధకుడు, ఖిలా వరంగల్ తిమ్మాపురం గ్రామానికి చెందిన మధుపాక ఎల్లయ్యకు యూనివర్సిటీ డాక్టరేట్ ప్రకటించింది. గౌతమ బుద్ధాస్ టీచింగ్స్ అండ్ ఇట్స్ రెలవెన్స్ టూది కాంటెంపరరీ ఇండియన్ సొసైటీ అనే అంశంపై సమర్పించిన పరిశోధనాత్మక సిద్ధాంత గ్రంథానికి ఎల్లయ్యకు డాక్టరేట్ ప్రదానం చేసినట్లు కేయూ పరీక్షల నియంత్రణాధికారి ప్రొఫెసర్ నర్సింహాచారి తెలిపారు. ఆ విభాగం రిటైర్డ్ ప్రొఫెసర్ రామానుజరావు పర్యవేక్షణలో ఎల్లయ్య తన పీహెచ్‌డీ పూర్తిచేశారు.

రోడ్డు అధ్వానం

- గుంతలు ఏర్పడి కంకర తేలిన వైనం
- అవస్థలు పడుతున్న ప్రజలు, వాహనదారులు

రఘునాథపల్లి: మండలంలోని ఇబ్రహీంపూర్-నిడిగొండ రోడ్డు దారుణంగా ఉంది. గుంతలు ఏర్పడి కంకర తేలడంతో ఈ రహదారిపై వెళ్లే ఫతేషాపూర్, ఇబ్రహీంపూర్, లక్ష్మీతండా, మాధారం గ్రామస్తులు తీవ్ర అసౌకర్యానికి గురవుతున్నారు. రోడ్డు అధ్వానంగా మారడంతో ప్రజలు నిత్యం రాకపోకలకు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. దాదాపు మూడు కిలోమీటర్ల మేర రహదారి చిద్రంగా మారింది. దీంతో వాహనదారులు తీవ్ర అవస్థలు పడుతున్నారు. రాత్రి వేళలో ప్రయాణించాలంటే తిప్పలు తప్పడం లేదు. యేడాది క్రితం రహదారి మరమ్మతులకు నిధులు మంజూరైనా టెండర్ ప్రక్రియ ముందుకు సాగలేదు. ఈ రహదారిపై నిత్యం టిప్పర్లు నడుస్తుండటంతో రోడ్డు మరింత అధ్వానంగా మారింది. రోడ్డుపై ఆటోలు కూడా వెళ్లలేని స్థితికి చేరుకుంటున్నా పాలకులు, అధికారులు పట్టించుకోవడం లేదని ప్రజలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఈ గ్రామాల నుంచి నిత్యం వందలాది మంది మండల కేంద్రానికి, జిల్లా కేంద్రానికి వెలుతుంటారు. ఇప్పటికైనా పాలకులు, అధికారులు స్పందించి ఈ రోడ్డుపై బీటీ వేయాలని అయా గ్రామాల ప్రజలు కోరుతున్నారు.


కంకర తేలిన ఇబ్రహీంపూర్-నిడిగొండ రహదారి

నియామక ఉత్తర్వులు జారీ చేయాలి

తరిగొప్పుల: నాటి తెలంగాణ ప్రభుత్వం వీఆర్ఏలను రెగ్యూలరైజ్ చేస్తూ కారుణ్య నియామకాల కోసం జారీ చేసిన జీ.ఓ.నంబర్ 81, 85 ప్రకారం 61 ఏళ్లు పైబడిన వీఆర్‌ఏల వారసులకు నియామక ఉత్తర్వులు జారీ చేసే విధంగా రాష్ట్ర ప్రభుత్వం దృష్టికి తీసుకువెళ్లాలని మండల వీఆర్‌ఏలు కోరారు. మండలంలోని అక్కరాజుపల్లికి చెందిన బైరి పోషయ్య ఇటీవల అనారోగ్యంతో మృతిచెందగా బాధితకుటుంబ సభ్యులను ఎమ్మెల్సీ ప్రొఫెసర్ కోదండరాం ఆదివారం పరామర్శించారు. కాగా, వీఆర్‌ఏల వారసులు ఆయనను కలిసి వినతిపత్రం అందజేశారు. వీఆర్‌ఏల వారసులకు నియామక పత్రాలను అందజేసి వారి కుటుంబాలను ఆదుకోవాల్సిందిగా వారు కోరారు. వినతిపత్రం అందజేసిన వారిలో తాటి రాజు, కలకుంట్ల నాగరాజు, సుంకరి రమేష్, రాజు, అబ్బాయ్య, అయిలయ్య, కనకయ్య, మహిపాల్, వరుణ్, సతీష్, మధు, తిరుమలేష్ తదితరులు ఉన్నారు.


వినతిపత్రం అందజేస్తున్న వీఆర్‌ఏల వారసులు

ప్రజల పక్షపాతి సీపీఎం

జఫర్‌గఢ్: సీపీఎం ఆవిర్భావం నుంచి ప్రజల పక్షపాతియని పార్టీ జిల్లా కార్యదర్శి వర్గ సభ్యుడు రాపర్తి సోమయ్య అన్నారు. మండలంలోని తీగారం గ్రామంలో వివిధ పార్టీలకు చెందిన 20 మంది సోమయ్య సమక్షంలో ఆదివారం సీపీఎంలో చేరారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అనునిత్యం ప్రజల మధ్యలో ఉంటూ ప్రజల పక్షాన పోరాడేది ఒక్క సీపీఎం పార్టీయేనన్నారు. ప్రజా సమస్యలపై సీపీఎం చేస్తున్న పోరాటాలకు ఆకర్షితులై పలువురు పార్టీలో చేరుతున్నారన్నారు. కార్యక్రమంలో కలకోట ప్రభాకర్, కలకోట వెంకన్న, నర్సయ్య, వెంకటనర్సు, నరేష్, నర్సింగం, సంపత్, మల్లయ్య, కనకాచారి, నాంపల్లి, యాదగిరి, నర్సయ్య తదితరులు ఉన్నారు.


మాట్లాడుతున్న సోమయ్య

సమన్వయంతో పనిచేయాలి

చిల్పూరు: మండల ఫొటో గ్రాఫర్లందరం సమన్వయంతో పనిచేస్తూ సమస్యలు పరిష్కరించుకుందామని సంఘం మండల ప్రధాన కార్యదర్శి అలుగు అశోక్ అన్నారు. మండలంలోని మల్కాపూర్ గ్రామంలో ఆదివారం మండల ఫొటో గ్రాఫర్ల సంఘం అసోసియేషన్ నూతన కమిటీ సమావేశాన్ని గౌరవ అధ్యక్షుడు కర్ణకంటి నాగరాజ్‌కుమార్ అధ్యక్షతన ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా అశోక్ మాట్లాడుతూ ప్రస్తుతం సెల్ ఫోన్ల మూలంగా ఫొటో గ్రాఫర్లం తీవ్ర ఇబ్బందులను ఎదుర్కొంటున్నామని, ఏది సాధించాలన్నా అందరం ఐకమత్యంగా ముందుకు సాగుదామని అందుకు తనపూర్తి సహకారాన్ని అందిస్తానని తెలిపారు. సమావేశంలో ఉపాధ్యక్షుడు ఆకోజు పున్నం చందర్, కోశాధికారి కలకోల్ల ఉపేందర్, కార్యదర్శి ఖలీల్, సహాయ కార్యదర్శి నల్ల జేమ్స్, ప్రచార కార్యదర్శి శేఖర్, సలహాదారుడు సోమ రవికుమార్ తదితరులు పాల్గొన్నారు.

కొనసాగుతున్న ఇంటింటా 'మిషన్' సర్వే


స్టేషన్‌ఘన్‌పూర్: సర్వే చేస్తున్న ఈఓ సత్యనారాయణ తదితరులు

స్టేషన్‌ఘన్‌పూర్: ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు గ్రామాల్లో మిషన్ భగీరథ నల్లా కనెక్షన్ల గురించి గ్రామ పంచాయతీ అధికారులు, సిబ్బంది, వీఓఏలు చేపడుతున్న సర్వే కొనసాగుతోంది. ఈ మేరకు డివిజన్‌కేంద్రమైన ఘన్‌పూర్‌లో ఆదివారం గ్రామ పంచాయతీ సిబ్బంది చేస్తున్న సర్వేను ఈఓ సత్యనారాయణ పరిశీలించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ గ్రామంలో మిషన్ భగీరథ నల్లాల కనెక్షన్ల గురించి సమగ్ర సర్వే చేస్తున్నట్లు తెలిపారు. ఇంటి నంబర్ల ఆధారంగా వార్డుల వారిగా ఇంటింటా తిరుగుతూ మిషన్ భగీరథ నల్లాలు ఉన్నాయా, లేవా అనే వివరాలు, ఇంటి యజమాని ఆధార్‌కార్డు నంబర్ తదితర వివరాలను నమోదు చేసుకుంటున్నామన్నారు. గత నాలుగు రోజులుగా సర్వే చేస్తున్నామని, ఇప్పటివరకు 50 శాతం పూర్తయిందన్నారు. సర్వేకు ప్రజలు సహకరించాలని, ఈనెల 20లోపు సర్వే పూర్తి చేసి నివేదికను ఉన్నతాధికారులకు అందిస్తామని తెలిపారు. కార్యక్రమంలో బిల్ కలెక్టర్ పులి నర్సింహులు, దామెర రవి, స్వామి, రాజు, గ్రామ పంచాయతీ సిబ్బంది, వీఓఏలు తదితరులు పాల్గొన్నారు.

బచ్చన్నపేటలో..

బచ్చన్నపేట: మండలంలోని పలు గ్రామాల్లో మిషన్ భగీరథ నల్లా కనెక్షన్ల సర్వే కొనసాగుతోంది. ఆదివారం పంచాయతీ కార్యదర్శులు ఇంటింటికి వెళ్లి సర్వే చేశారు. ఇంటికి సరిపడా తాగునీరు వస్తుందా, ఇంట్లో ఎంత మంది కుటుంబ సభ్యులు ఉంటున్నారనే విషయాలను సర్వే చేసి నల్లా వద్ద ఇంటి యజమానిని ఫొటో తీసి ఆన్‌లైన్ చేస్తున్నారు. ఈ సర్వేలను తొందరగా పూర్తి చేయాలని పలువురు అధికారులు సూచించారు. ఆయా గ్రామాల సీఏలు, జీపీ సిబ్బంది పాల్గొన్నారు.


బచ్చన్నపేట: సర్వే చేస్తున్న కార్యదర్శి రూపాచైతన్య

పూర్వవిద్యార్థుల ఆత్మీయ సమ్మేళనం


చిల్పూరు: సమ్మేళనంలో పాల్గొన్న పూర్వవిద్యార్థులు


స్టేషన్‌ఘన్‌పూర్: సమ్మేళనంలో ఉపాధ్యాయులతో పూర్వవిద్యార్థులు

చిల్పూరు: మండలంలోని మల్కాపూర్ ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో 1989-90లో 10వ తరగతి చదువుకున్న పూర్వవిద్యార్థులు మండల కేంద్రంలోని ఓప్రైవేట్ ఫంక్షన్ హాల్‌లో ఆత్మీయ సమ్మేళనం ఆదివారం నిర్వహించారు. ఈ సందర్భంగా చిన్ననాటి జ్ఞాపకాలను గుర్తుచేసుకున్నారు. అనంతరం నాడు పాఠాలు బోధించిన ఉపాధ్యాయులను ఘనంగా సన్మానించారు. గణగోని రమేష్, బబ్బుల రాజశేఖర్, విరాట్, వైకుంఠం, రాజేందర్, కుమారస్వామి, రేణుక, ధనలక్ష్మి, రమణ పాల్గొన్నారు.

శివునిపల్లిలో..

స్టేషన్‌ఘన్‌పూర్: మండలంలోని శివునిపల్లి జెడ్పీఎస్ఎస్‌లో 14 సంవత్సరాల క్రితం కలిసి చదువుకున్న పూర్వ విద్యార్థుల అపూర్వ సమ్మేళన కార్యక్రమం అదే పాఠశాల వేదికగా ఆదివారం ఆద్యంతం ఉత్సాహంగా ఉల్లాసంగా జరిగింది. 2010-11 విద్యాసంవత్సరంలో శివునిపల్లి జెడ్పీఎస్ఎస్‌లో పదో తరగతి చదువుకున్న పూర్వవిద్యార్థుల సమ్మేళన కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా 14 సంవత్సరాల క్రితం కలిసి చదువుకున్న విద్యార్థులు ఒకేచోట చేరి కరచాలనాలు చేసుకుంటూ పరస్పరం యోగక్షేమాలు తెలుసుకున్నారు. అనంతరం తమకు విద్యాబుద్ధులు నేర్పిన ఉపాధ్యాయులను ఘనంగా సన్మానించారు. జెడ్పీఎస్ఎస్ హెచ్‌ఎం కె.రమేశ్, ఉపాధ్యాయులు రాజీమహ్మద్, పూర్ణచందర్, రంగరాజు,శ్రీకాంత్, ఫకీర్‌దాస్ తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థులకు నోట్ బుక్స్ పంపిణీ

జనగామ: వాసవి క్లబ్ గెలాక్సీ జనగామ, వాసవి క్లబ్ అనిత గెలాక్సీ జనగామ వారి ఆధ్వర్యంలో డాన్ టు డేస్ ప్రోగ్రాం ద్వారా విద్యార్థులకు నోట్ బుక్స్‌ను అందించినట్లు చైర్మన్ శుభోద్ గుప్తా తెలిపారు. ఆదివారం ఆయన మాట్లాడుతూ పుట్టిన రోజు జరుపుకున్న సామ శ్రీనివాస్ 100 నోట్ బుక్స్‌ను అందించారని తెలిపారు. అలాగే ఇద్దరు కానిస్టేబుళ్లకు సన్మానం చేశామని, పూసనాల శ్రీవల్లి అవయవ దానానికి ఒప్పుకుని అంగీకార పత్రాన్ని ఇచ్చారని చెప్పారు. అలాగే పలువురు నూతన సభ్యులు క్లబ్‌లో సభ్యత్వం తీసుకున్నారని తెలిపారు. క్లబ్ అధ్యక్షులు సిద్దేశ్వర , బజ్జూరి వెంకటేశ్వర్లు, పావని, ఐత శ్రీకాంత్ పాల్గొన్నారు.


నోట్ బుక్స్ పంపిణీ చేసిన క్లబ్ సభ్యులు

కమ్యూనిటీ హాల్ మంజూరు చేయండి

రఘునాథపల్లి: మండలంలోని మండలగూడెం గ్రామానికి చెందిన కాంగ్రెస్ మండల ప్రధాన కార్యదర్శి అరూరి గంగ గ్రామానికి ఎస్సీ కమ్యూనిటీ మంజూరు చేయాలని వరంగల్ ఎంపీ కడియం కావ్యను ఆదివారం కలిసి వినతి పత్రం అందజేశారు. హనుమకొండలో కడియం నివాసంలో నూతనంగా ఎన్నికైన ఎంపీని ఆమె మర్యాద పూర్వకంగా కలిసి శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా మండలగూడెంలోని ప్రధాన సమస్యలు ఎంపీకి వివరించారు. తమ వినతికి ఎంపీ సానుకూలంగా స్పందించినట్లు గంగ తెలిపారు.


కావ్యకు వినతి పత్రం అందజేస్తున్న అరూరి గంగ

డిప్యూటీ సీఎంని కలిసిన టీపీసీసీ సభ్యుడు



దేవరుప్పుల: తెలంగాణ రాష్ట్ర ఉపముఖ్యమంత్రి భట్టి విక్రమార్క జన్మదినం పురస్కరించుకొని టీపీసీసీ సభ్యుడు, కాంగ్రెస్ డాక్టర్స్ సెల్ విభాగం జిల్లా చైర్మన్ డాక్టర్ లకావత్ లక్ష్మీనారాయణ, ఉమ్మడి వరంగల్ జిల్లా మాజీ జెడ్పీచైర్‌పర్సన్ ధన్వంతి కలిసి హైదరాబాద్ సచివాలయంలో పుష్పగుచ్ఛం ఇచ్చి శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా జిల్లాలో నెలకొన్న రాజకీయ పరిస్థితులు, ప్రజాపాలన తీరుపై ఆరా తీసినట్లు లక్ష్మీనారాయణ చెప్పారు.

కేసీఆర్‌ను కలిసిన సోషల్ మీడియా బృందం



బీఆర్‌ఎస్ వ్యవస్థాపక అధ్యక్షుడు, మాజీ సీఎం కేసీఆర్‌ను పాలకుర్తి నియోజకవర్గ బీఆర్‌ఎస్ సోషల్ మీడియా ఇన్‌చార్జ్ వడ్లకొండ వినయ్ బృందం ఆదివారం గజ్వేల్‌లోని ఎర్రవల్లి ఫామ్‌హౌస్‌లో కలిశారు. ఈ సందర్భంగా బీఆర్‌ఎస్ తెలంగాణ పునర్నిర్మాణం కోసం పాటుపడిన వాస్తవికతను ప్రజల్లోకి తీసుకెళ్లి పార్టీ పూర్వవైభవం కోసం పాటుపడాలని సూచించినట్లు తెలిపారు.

గోవులు తరలించకుండా అధికారుల పహారా


అంగడిలో గోవులు తరలిపోకుండా పహారా కాస్తున్న పశువైద్యాధికారి తదితరులు


ఎస్సైకి వినతి పత్రం అందజేస్తున్న నాయకులు

చిల్పూరు: నేడు (సోమవారం) బక్రీద్‌ను పురస్కరించుకుని ఆదివారం జరిగిన చిల్పూరుగుట్ట అంగడి నుంచి గోవులను తీసుకెళ్లి గోవధ జరుగ కుండా ఉండేందుకు మండల పశువైద్యాధికారి మూడిక అనేష్ ఆధ్వర్యంలో సిబ్బంది పహారా కాశారు. ఈ సందర్భంగా అనేష్ మాట్లాడుతూ స్టేట్ యానిమల్ వెల్ఫేర్ బోర్డు, సొసైటీ ఫర్ ప్రివెన్షన్ ఆఫ్ క్రుయాల్టీ యానిమల్ సంస్థ నిబంధనలకు అనుగుణంగా అంగడిలో నుంచి అక్రమంగా గోవులను కొనుగోలు చేసి తరలించకుండా స్థానిక ఎస్సై ముత్యం రాజేందర్ సహకారంతో పహారా నిర్వహించారు. ఒకవేళ పాడి రైతు కొనుగోలు చేస్తే అతని ఆధార్ కార్డు, పూర్తి సమాచారం సేకరించామని నెలలో ఎప్పుడైనా కొనుగోలో చేసిన ఆవులు ఉన్నాయా లేదా చూస్తామని, లేకుంటే అతనిపై చర్యలు తీసుకోవడం జరుగుతుందని తెలిపారు. కార్యక్రమంలో చిల్పూరు ఆలయ మాజీ చైర్మన్, కాంగ్రెస్ పార్టీ మండల నాయకుడు మూల నాగరాజు, బీజేపీ నాయకుడు సాదం భీమన్న, ఫయాజ్, భిక్షపతి, రమేష్ తదితరులు ఉన్నారు.

బక్రీద్‌లో గోవధను నివారించాలి

రఘునాథపల్లి: బక్రీద్ పర్వదిన సందర్భంగా జరిగే గోవధను పూర్తిగా నివారించాలని మండల విశ్వ హిందూ పరిషత్ బజరంగ్ దళ్ నాయకులు కోరారు. ఈ మేరకు ఆదివారం స్థానిక పోలీస్‌స్టేషన్‌లో వినతి పత్రం అందజేశారు. మండల కేంద్రంలో గోవధ జరగకుండా చట్టపరమైన చర్యలు తీసుకోవాలని విజ్ఞప్తి చేశారు. విశ్వహిందూ పరిషత్ బజరంగ్ దళ్ మండల అధ్యక్షుడు పెసరు అనిల్, ఉపాధ్యక్షుడు వడాల సురేష్, మంచోజు జితేందర్, నోముల సురేష్, వడాల శ్రీనివాసు, వడాల ఉదయ్, రజనీకాంత్, సాంబరాజు, శివ, ఉదయ్ తదితరులు ఉన్నారు.

విద్యుదాఘాతంతో మూగజీవాల మృతి


విద్యుదాఘాతంతో మృత్యువాత పడిన మూగజీవాలు

దేవరుప్పుల: ప్రమాదవశాత్తు విద్యుదాఘాతంతో మూగజీవాలు మృత్యువాత పడిన సంఘటన చిన్నమడూరులో చోటుచేసుకుంది. ఆదివారం గ్రామానికి చెందిన మొటికె నర్సయ్య ఇదే గ్రామంలోని అక్కెనపల్లి రాములు వ్యవసాయ భూమి ఏరియాలో మూగజీవాల (గొర్రెలు, మేకలు)ను మేపుతుండగా 100 కేవీ విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్ వద్ద విద్యుత్ షాక్ కొట్టి నాలుగు జీవాలు మృత్యువాత పడ్డాయి. ఈ సంఘటనతో సుమారు రూ.60 వేల నష్టం వాటిల్లిందని పెంపకందారుడు వాపోయాడు. సంఘటన స్థలానికి విద్యుత్ సిబ్బంది చేరుకొని పరిశీలించారు. బాధితుడు నర్సయ్యకు ప్రభుత్వపరంగా పరిహారం అందించాలని గొర్రెలు, మేకల పెంపకందారుల సంఘం జిల్లా కమిటీ సభ్యుడు జీగరి యాదగిరి డిమాండ్ చేశారు.

కళాకారులకు పురస్కారాల ప్రదానం

నయీంనగర్: తెలుగు సంస్కృతీ సాహితి సేవా ట్రస్ట్ వ్యవస్థాపక చైర్మన్ మాచవరం గౌరిశంకర్ ఆధ్వర్యంలో హనుమకొండ ప్రెస్ క్లబ్‌లో ఆదివారం నిర్వహించిన కార్యక్రమంలో కళాకారులకు జాతీయ పురస్కారాలను వర్ధన్నపేట ఎమ్మెల్యే కేఆర్.నాగరాజు అందజేశారు. కార్యక్రమంలో దేవాదాయ శాఖ ఈఓల సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి అద్దంకి నాగేశ్వర్ రావు, మహిపాల్, గర్రెపల్లి నవీన్ కుమార్, కరుణాకర్ గుప్తా, కళాకారులు, తదితరులు పాల్గొన్నారు.


పురస్కారాలు అందజేస్తున్న ఎమ్మెల్యే నాగరాజు

విద్యార్థి ఆచూకీ లభ్యం

దేవరుప్పుల: ఓ విద్యార్థి అదృశ్యం విషయంలో పోలీసుల సత్వరచర్యలతో ఆచూకీ లభ్యం కావడంతో బాధిత తల్లిదండ్రులకు అప్పగించిన సంఘటన ఆదివారం రాత్రి కడవెండిలో చోటుచేసుకుంది. మండలంలోని కడవెండికి చెందిన నక్కరబోయిన భాస్కర్ కొడుకు శేఖర్ (17) జనగామ పట్టణంలోని ఓ ప్రైవేట్ కళాశాలలో ఇంటర్ చదువుతున్నాడు. ఇటీవల తరగతుల ప్రారంభం దృష్ట్యా కళాశాలలో కట్టాల్సిన ఫీజుపై తల్లిదండ్రులపై ఒత్తిడి పెంచే క్రమంలో ఆర్థికస్థితిగతుల అచేతన పరిస్థితులతో రెండు రోజులు ఆగాలని మందలించారు. దీంతో మనస్థాపానికి గురైన శేఖర్ ఇంటి నుంచి వెళ్లిపోయాడు. సాయంత్రం వరకూ ఇంటికి రాకపోవడంతో ఫోన్‌చేసినా లిఫ్ట్ చేయపోవడంతో అనుమానం వచ్చిన తండ్రి స్థానిక ఎస్సై ఎస్.చెన్నకేశవులకు ఫోన్ ద్వారా మొరపెట్టుకున్నారు. ఈ విషయమై స్పందించిన ఎస్సై సిబ్బందిచే సెల్‌ఫోన్ లోకేషన్ ట్రేస్ చేసి గాలించగా కడవెండి శివారు చిప్పరాళ్లబండతండా జీపీ పరిధి దుబ్బగుట్ట ఏరియాలో రాత్రి 10 గంటలకు ఆచూకీ లభ్యమైంది. విద్యార్థికి పోలీసులు కౌన్సిలింగ్ ఇచ్చి తల్లిదండ్రులకు అప్పగించారు. అదృశ్యమైన విద్యార్థిని సత్వరమే వెతికితీసుకవచ్చిన హెడ్‌కానిస్టేబుల్ శ్యాం, కానిస్టేబుల్ యాకుబ్, అశోక్‌ను ఎస్సైతోపాటు గ్రామస్తులు అభినందించారు.


తల్లిదండ్రులకు శేఖర్‌ను అప్పగించిన పోలీసులు

అవార్డు గ్రహీతకు వాకర్స్ సన్మానం



కేయూ క్యాంపస్: రక్త దాతల దినోత్సవం సందర్భంగా రాష్ట్రస్థాయి ఉత్తమ ప్రజాసేవ అవార్డును హైదరాబాద్‌లో గవర్నర్ నుంచి కేయూ వాకర్స్ అసోసియేషన్ బాధ్యుడు దేశిని లక్ష్మీనారాయణ అందుకున్నారు. ఈమేరకు క్యాంపస్‌లోని దూరవిద్యా కేంద్రం ప్రాంగణంలో కేయూ ప్రగతి వాకర్స్ అసోసియేషన్ బాధ్యులు ఆదివారం సన్మానించారు. వాకర్స్ అసోసియేషన్ అధ్యక్షుడు నల్లాని శ్రీనివాస్, ప్రధాన కార్యదర్శి సత్యనారాయణ, బాధ్యులు మహేందర్ రావు, రతన్‌సింగ్, ప్రొఫెసర్ సంజీవరెడ్డి, ప్రొఫెసర్ లక్ష్మారెడ్డి, ప్రొఫెసర్ వెంకయ్య, డాక్టర్ ఆశీర్వాదం, డాక్టర్ హరిప్రసాద్, ప్రతాప్‌రెడ్డి పాల్గొన్నారు.